క్లుప్తంగా

ఆకట్టుకున్న జ్యోతుల ప్రతిమలు



గుడ్లవల్లేరు: కొతవరం ఒకటో వార్డు విజయలక్ష్మి రైస్ మిల్ వద్ద దసరా నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం భక్తులు ఏర్పాటు చేసిన జ్యోతుల ప్రతిమలు ఆకట్టుకున్నాయి. ఓంకారం, స్వస్తిక్, వినాయకుడి ప్రతిమలతో పాటు బతుకమ్మకు చేసిన పూల అలంకరణ ఆకర్షించింది.

భారీ అన్నసమారాధన

గుడివాడ టౌన్: స్థానిక మార్కెట్ సెంటర్‌లో గుడివాడ పండ్ల వర్తక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. గుడివాడ కో–ఆపరేటివ్ అర్బన్‌బ్యాంక్ మాజీ చైర్మన్ పిన్నమనేని పూర్ణవీరయ్య, పండ్ల వర్తక సంఘం అధ్యక్షుడు గోకరకొండ బలరామ్ అన్నసమారాధన ప్రారంభించారు. వ్యాపారులు చిన్న, ఫణికుమార్, ప్రకాష్, సింహాచలం, శ్రీను, వంశి, మహేష్ పాల్గొన్నారు.

పెదపారుపూడిలో..

పెదపారుపూడి: మండలంలోని వానపాముల గ్రామంలో శ్రీపార్వతీతల్లి ఆలయంలో శుక్రవారం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకులు చిదంబరం అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: స్థానిక ఎన్టీఆర్ కాలనీలో శుక్రవారం వాసు భవాని ఆధ్వర్యంలో అన్నసమారాధన చేపట్టారు. భక్తులు అధికసంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని అన్న ప్రసాదాలను స్వీకరించారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా

టౌన్‌హాల్లో మందుబాబుల హల్‌చల్

స్వాతంత్రోద్యమ కాలం నుంచి ప్రజా సేవలో తరించిన కైకలూరు టౌన్‌హాల్ అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారింది. క్రీడల నిర్వహణ గ్రంథాలయ పఠనానికి పేరు మోసిన గడ్డపై ఇప్పుడు ఎక్కడ చూసినా తాగి పడేసిన బ్రాందీ సీసాలు, సిగరెట్ పీకలు దర్శనమిస్తున్నాయి. పట్టించుకునే నాథుడే లేకపోవడంతో దొంగలు అందినకాడికి అన్నీ దోచుకుపోయారు.

కైకలూరు: పామర్రు–దిగమర్రు జాతీయ రహదారి సమీపంలో ఉండటంతో పగలు, రాత్రి తేడా లేకుండా మందుబాబులు జోగుతూ, ఊగుతూ హల్‌చల్ చేస్తున్నారు. కైకలూరు వ్యవసాయ మార్కెట్ యార్డు దాటిన తర్వాత సుమారు రెండు ఎకరాల పైబడి విస్తీర్ణంలో టౌన్‌హాల్ ఉంది. 1925 ప్రాంతంలో సుదర్శన్ అనే వ్యక్తి ప్రజలకు యోగాసనాలు నేర్పించేవారు. అనంతరం ఉప్పులూరు వంశానికి చెందిన పెద్దలు ప్రజా ప్రయోజనాలకు స్థలాన్ని అందించారు. కొంతమంది కమిటీ ఆధ్వర్యంలో క్రీడలు, గ్రంథాలయం నడిపేవారు. తర్వాత క్లబ్‌గా రూపాంతరం చెందింది. వెనక వైపున రెండంతస్తుల బిల్డింగ్‌ను కట్టారు. పేకాట ఆడుతున్నారనే సమాచారంతో పోలీసులు దాడి చేసిన ఘటనలు ఉన్నాయి. కొద్ది సంవత్సరాల క్రితం వరకు గుమస్తా ఉన్నారు. ఇప్పుడు పట్టించుకునే వారు లేకపోవడంతో టౌన్‌హాల్ మందుబాబుల స్థావరంగా మారింది.

ఇనుము, వస్తువుల చోరీ

పర్యవేక్షణ లేకపోవడంతో టౌన్‌హాల్లో వస్తువులు చోరీకి గురయ్యాయి. కొత్తగా నిర్మించిన బిల్డింగ్ తలుపులు పగలుగొట్టి లోపల ఫర్నిచర్‌ను ఎత్తుకుపోయారు. అకతాయిలు అద్దాలు పగలుగొట్టారు. బిల్డింగ్ పైన శ్లాబ్ ఫిల్లర్స్‌ను పగలగొట్టి ఇనుప ఊచలను సైతం దొంగిలించారు. ప్లాస్టిక్ పైపులనూ వదల్లేదు. టౌన్‌హాల్లోకి ఎవరు వస్తున్నారో పర్యవేక్షణ లేకపోవడంతో ఇక్కడ గందరగోళం నెలకొంది. ఇదిలా ఉంటే కాలం చెల్లిన గ్రంథాలయ భవనం ఎప్పుడు కూలుతుందోనని అందరూ భయపడుతున్నారు. ఎన్నికల్లో ఇక్కడ రాజకీయ సమావేశాలు నిర్వహిస్తున్నారు. కార్తీక వన సమారాధనలు సైతం చేస్తున్నారు. ప్రమాదం జరగక ముందే కూల్చివేయడం మంచిదని పలువురు భావిస్తున్నారు.



అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిన టౌన్‌హాల్ బిల్డింగ్ (ఇన్‌సెట్‌లో) మందుబాబుల కారణంగా ఏర్పడిన చెత్త

మందుబాబుల వీరంగం

టౌన్‌హాల్లోలో ఉదయం 5.30 గంటల నుంచి మందుబాబులు వీరంగమాడుతున్నారు. ద్విచక్ర వాహనాలపై వచ్చి తప్పతాగి వెళుతున్నారు. ఇక రాత్రి అయితే ఇక్కడ లైట్లు లేకపోవడంతో సెల్‌ఫోన్ వెలుతురులో పార్టీలు చేసుకుంటున్నారు. తాగిన సీసాలను పగలగొడుతున్నారు. టైన్‌హాలు బిల్డింగ్‌లో ఎక్కడ చూసినా మందు సీసాలు, బీరు బాటిల్స్, సిగరెట్ పీకలు, వాటర్ ప్యాకెట్లు దర్శనమిస్తున్నాయి. రాత్రి వేళల్లో తాగి కేకలు వేయడంతో సమీపంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం నేరం. ఇటువంటి ఘటనలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటాం. కైకలూరు టౌన్ హాల్లో మద్యం తాగి, అల్లరి చేసే వారిని గుర్తించి చర్యలు తీసుకుంటాం. పోలీసులతో నిఘా ఏర్పాటు చేస్తాం.

– పి.కృష్ణ, పట్టణ సీఐ, కైకలూరు

సమస్యల పరిష్కారానికి కృషి



గుడివాడరూరల్: నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. స్థానిక ఏలూరురోడ్డులోని ప్రజావేదికలో మున్సిపల్ అధికారులతో శుక్రవారం ఎమ్మెల్యే సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడివాడ అభివృద్ధికి అతి త్వరలో నిధులు వస్తున్నాయని వాటి ద్వారా పట్టణాభివృద్ధికి కావాల్సిన అంచనాలు రూపొందించాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. అసిస్టెంట్ కమిషనర్ పి.శ్రీనివాస్, డీఈలు సతీష్‌చంద్ర, వరప్రసాద్, ఏఈలు ప్రభాకర్, తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు 588 దరఖాస్తులు

కైకలూరు: మద్యం దుకాణాల ఏర్పాటుకు కైకలూరు నియోజకవర్గం నాలుగు మండలాల నుంచి ఆఖరి రోజు 588 దరఖాస్తులు వచ్చాయని ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ రమేష్ శుక్రవారం తెలిపారు. నియోజకవర్గంలో మండలాల వారీగా కైకలూరులో 8, కలిదిండిలో 5, మండవల్లిలో 3, ముదినేపల్లిలో 5 కలిపి మొత్తం 21 ప్రైవేటు మద్యం దుకాణాలను కేటాయించారు. కైకలూరు ఎక్సైజ్ కార్యాలయం వద్ద సాయంత్రం 5 గంటల వరకు క్యూలో ఉన్న దరఖాస్తుదారులకు టోకెన్లు అందించి దరఖాస్తులు తీసుకున్నారు.

ఫొటోథెరపీ మిషన్ బహూకరణ



కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలం కూచిపూడిలోని సిలికానాంధ్ర సంజీవని సాయి ఆరోగ్య వైద్యాలయానికి రూ.60 వేల విలువ గల ఫొటోథెరపీ మిషన్‌ను పెనుమత్స గ్రామానికి చెందిన దాతలు యార్లగడ్డ సుభాషచంద్ర బోస్, వెంకట అన్నపూర్ణ శుక్రవారం అందజేశారు. హాస్పిటల్ ఏఓ హనుమకుమార్, సలహా మండలి సభ్యులు వెంకటేశ్వరరావు, శివకుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

■ రెండు కేజీల గంజాయి స్వాధీనం



పెదపారుపూడి: రెండు కేజీల గంజాయిని అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తి వద్ద నుంచి, గంజాయి, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పామర్రు సీఐ సుభాకర్ తెలిపారు. పెదపారుపూడి పోలీస్ స్టేషన్‌లో నిందితుడ్ని శుక్రవారం ప్రదర్శించారు. సీఐ మాట్లాడుతూ మోక ఫణీంద్ర పెదపారుపూడిలోని విజయవాడ రోడ్డులో అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. నిందితుడ్ని గుడివాడ కోర్టుతో హాజరు పరిచామని తెలిపారు. పెదపారుపూడి ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

■ బాలికల సంరక్షణ అందరి బాధ్యత

కైకలూరు: బాలికల సంరక్షణను అందరూ బాధ్యతగా భావించాలని ఎంపీపీ అడవి కృష్ణ అన్నారు. బాలికల దినోత్సవం సందర్భంగా మండల పరిషత్ సమావేశ మందిరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలికల హక్కులపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఇన్‌చార్జి తహసీల్దారు ఎండీ ఇబ్రహీం, ఇన్‌చార్జి ఎంపీడీఓ వై.ప్రకాశరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వి.కృష్ణకుమారి, షాహిదాఖానం పాల్గొన్నారు.

■ బాలికా దినోత్సవ వేడుకలు

ముదినేపల్లి రూరల్: స్థానిక మండల పరిషత్ సమావేశం హాల్లో అంతర్జాతీయ బాలికా దినోత్సవ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. కై కలూరు సీడీపీఓ దీప్తి ముఖ్యఅతిథిగా పాల్గొని కిశోర బాలికలకు ఆరోగ్య, స్వీయరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ప్రసూన, ఝాన్సీ పాల్గొన్నారు.

■ రైతు బజారులో వంట నూనెల విక్రయాలు

కైకలూరు: ప్రభుత్వం సామాన్యులకు మేలు చేయడానికి రైతు బజారుల ద్వారా వంట నూనెలను విక్రయిస్తోందని మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు అన్నారు. స్థానిక రైతు బజారులో పౌరసరఫరాల శాఖ నిర్వహణలో కిరాణా మర్చెంట్ అసోషియేషన్ ఏర్పాటు చేసిన స్టాల్‌ను ఆయన శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. పామాయిల్ 850 గ్రాములు మార్కెట్‌లో రూ.125 ఉండగా రైతు బజారులో రూ.110కి, సన్‌ఫ్లవర్ ఆయిల్ 910 గ్రాములు బయట మార్కెట్‌లో రూ.138 ఉండగా రైతు బజారులో రూ.124కి విక్రయిస్తున్నట్లు చెప్పారు.

■ సమాజ సేవలో పాలుపంచుకోవాలి



పామర్రు: పాస్టర్లు ప్రభువు సేవతో పాటు సమాజ సేవలో కూడా పాలు పంచుకోవాలని ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. స్థానిక గుడివాడ రోడ్డులోని పీటీ, పీఎఫ్ కార్యాలయంలో పాస్టర్ల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సమాజంలో ఉత్తమ సేవలందిస్తున్న మచిలీపట్నానికి చెందిన యూపీఏ అధ్యక్షుడు రెవరెండ్ జి.ఏబెల్‌ను సన్మానించి ఉత్తమ పాస్టర్ అవార్డును ప్రదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో యూపీఏ ప్రతినిధులు ఎస్‌వాల్టర్, జాన్ వెస్లీ, ఫీలిప్, పీటీపీఎఫ్ అధ్యక్షుడు డాక్టర్ సాల్మన్ కొల్లాబత్తుల పాల్గొన్నారు.

■ క్రీడా విజేతలకు బహుమతుల ప్రదానం

గుడ్లవల్లేరు: అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని ఉలవలపూడిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు శుక్రవారం నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు సర్పంచ్ పామర్తి కన్య భాస్కరరావు బహుమతుల ప్రదానం చేశారు.

■ ప్రజాస్వామ్యం బలోపేతానికి ఆర్టీఐ మూలం

మండవల్లి: ప్రజాస్వామ్యం బలోపేతానికి ఆర్టీఐ మూలం అని ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, మండల శాఖ అధ్యక్షుడు టి.అప్పారావు, విద్యావేత్త వెంకయ్య అన్నారు. అక్టోబర్ 12న సమాచార హక్కు చట్టం వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మండవల్లిలో ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్టీఐపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఇండియన్ బ్యాంక్ మేనేజర్ కె.జ్యోతిప్రసాద్ ప్రారంభించారు.

■ అన్నదానం

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవా భవన్‌లో పేదలకు శుక్రవారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని కల్వపూడికి చెందిన తిపిర్నేని నాగరాణి జన్మదినం సందర్భంగా ఆమె భర్త నవకృష్ణ చౌదరి ఆర్థికసాయంతో నిర్వహించినట్లు లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ తెలిపారు.

■ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

గుడివాడరూరల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ ఎన్.చంటిబాబు పేర్కొన్నారు. మండలంలోని వలివర్తిపాడు గ్రామ సమీపంలోని బైపాస్‌రోడ్డులో శుక్రవారం వాహనాల తనిఖీలను చేపట్టారు. ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్‌లు, రికార్డులు కలిగి ఉండాలన్నారు.




పామర్రులో మహిషాసుర మర్దనిగా పర్వతవర్ధనీదేవి



తోట్లవల్లూరు శివాలయంలో మహిషాసురమర్దనిగా..



తటివర్రురోడ్డులో శ్రీకాళికాదేవిగా అమ్మవారు



ఆటపాక గ్రామంలో మహిషాసురమర్దనిగా..



మొవ్వలో అష్టలక్ష్మిగా దర్శనమిచ్చిన అమ్మవారు

మహిషాసురమర్దనీ పాహిమాం

దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా తొమ్మిదో రోజు జిల్లాలోని పలు ఆలయాల్లో శుక్రవారం అమ్మవార్లను మహిషాసురమర్దనిగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకున్నారు.



గుడివాడ భీమేశ్వరస్వామి దేవస్థానంలో కాళికాదేవిగా అమ్మవారు

పామర్రు: స్థానిక విజయవాడరోడ్డులోని కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారిని శుక్రవారం మహిషాసురమర్దనీ దేవిగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బొగ్గరపు జాలయ్య, బి.సాయిబాబు, బి.శ్రీనివాసరావు, ఆలయ అర్చకులు మాధవ్ పాల్గొన్నారు. స్థానిక అంకమ్మతల్లి, పర్వత వర్ధనీదేవి, సోమేశ్వరస్వామి ఆలయంలోని పార్వతీ అమ్మవారిని మహిషాసురమర్దనిగా అలంకరించారు. కొండిపర్రులోని భ్రమరాంబ దేవిని మహిషాసురమర్దనిగా అలంకరించారు.

పార్వతీ దేవిగా శ్యామలాంబ తల్లి

కైకలూరు: కైకలూరు శ్యామలాంబతల్లి పార్వతీదేవీ అలంకరణలో భక్తులకు శుక్రవారం దర్శనమిచ్చారు. ఉయ్యూరు జూనియర్ సివిల్ జడ్జి శ్రీహరి దంపతులు అమ్మవారిని దర్శించుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన కోలాల ప్రదర్శన, హరికథాగానం, కూచిపూడి నృత్యప్రదర్శన ఆకట్టుకున్నాయి. కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానంలో అమ్మవారికి నవమ నవావరణార్చన, లలిత సహస్రనామ కుంకుమ పూజలు నిర్వహించారు. లోకుమూడిగరువు దత్తాశ్రమంలో కోటికుంకుమ పూజ చేశారు. గురజాడ ఉదయశంకర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆటపాక, గోనెపాడు గ్రామాల్లో అమ్మవారు మహిషాసురమర్దనిగా దర్శినమిచ్చారు.



కైకలూరులో శ్యామలాంబను దర్శించుకున్న జడ్జి శ్రీహరి దంపతులు



మండవల్లి మల్లేశ్వరస్వామి ఆలయంలో..



మహిషాసురమర్దనిగా కొండలమ్మ అమ్మవారు

తోట్లవల్లూరులో.

తోట్లవల్లూరు: స్థానిక శ్రీభ్రమరాంబ చెన్నమల్లికార్జున స్వామి ఆలయంలో ఉత్సవాల తొమ్మిదో రోజు శుక్రవారం అమ్మవారు శ్రీమహిషాసురమర్దనిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ఈఓ హరిదుర్గా నాగేశ్వరరావు పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

గుడివాడలో..

గుడివాడరూరల్: తటివర్రురోడ్డులో ఏర్పాటు చేసిన ఉత్సవాల్లో అమ్మవారు శ్రీకాళికాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. చిన ఎరుకపాడులోని శ్రీఅష్టలక్ష్మి దేవస్థానంలో శ్రీమహిషాసురమర్దనిగా దర్శనమిచ్చారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్ : పెయ్యేరు బొమ్మినంపాడు, అల్లూరు కనకదుర్గమ్మ దేవపూడి విజయదుర్గాంబ ఆలయాల్లో శుక్రవారం మహిషాసురమర్దనిగా అమ్మవారిని అలంకరించారు. గురజ రామలింగేశ్వరస్వామి, శివాలయం పెదకామనపూడి రామలింగేశ్వరస్వామి ఊటుకూరు శివారు నారాయణపురం అంకమ్మ ఆలయాల్లో అమ్మవారు మహిషాసురమర్దనిగా దర్శనమిచ్చారు.

అష్టలక్ష్మిగా రాజ్యలక్ష్మి అమ్మవారు

మొవ్వ: మండలంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మొవ్వలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారు అష్టలక్ష్మిగా దర్శనమిచ్చారు.

మహిషాసురమర్దనిగా కొండలమ్మ

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ తల్లి అమ్మవారు మహిషాసురమర్దనిగా శుక్రవారం దర్శనమిచ్చారు. ఆలయ ఈఓ ఆకుల కొండలరావు ఆధ్వర్యంలో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో చిన్నారుల కోలాట ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. డోకిపర్రు భూ సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు సౌభాగ్యలక్ష్మిగా దర్శనమిచ్చారు.

మండవల్లిలో..

మండవల్లి: స్థానిక భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం అమ్మవారు మహిషాసురమర్దనిగా దర్శనమిచ్చారు. భక్తులు అధికసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

శ్రీ కాళికాదేవిగా అమ్మవారు

గుడివాడ టౌన్: స్థానిక బంటుమిల్లి రోడ్డులోని శ్రీ భీమేశ్వర స్వామి, కన్యకా పరమేశ్వరి దేవస్థానాల్లో అమ్మవార్లను శ్రీ కాళికాదేవిగా, శంకరమందిరంలో, విజయదుర్గ అమ్మవారి ఆలయాల్లోలో అమ్మవార్లను శుక్రవారం మహిషాసురమర్దనిగా అలంకరించారు. గౌరీశంకర స్వామి దేవస్థానంలో దుర్గాదేవిగా దర్శనమిచ్చారు.

బెంచీల వితరణ

మండవల్లి: భైరవపట్నం మూలపేట, సుబ్బారావుపేట, మోదుగుమూడి గ్రామాల్లో, ఆలయాల వద్ద, స్థానిక గంగానమ్మతల్లి ఆలయం వద్ద, శ్రీకృష్ణాలయం వద్ద, అగ్రహారం రామాలయం వద్ద శుక్రవారం హిందూ ధర్మ సమితి బెంచీలు వితరణ చేసింది. హిందూ ధర్మ సమితి వ్యవస్థాపక సభ్యుడు పసుపులేటి శ్రీనివాసరావు, నల్లమోతు సురేంద్ర, పి.సురేష్, పి.వేణుగోపాల్, పి.రత్నారావు, శివకృష్ణ, ఆదినారాయణ, బి.సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.